పర్యాటకాభివృద్ధిలో పెట్టుబడిదారులను స్వాగతిస్తాం

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు వచ్చే పెట్టుబడిదారులను స్వాగతిస్తామని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీసార్ట్స్, బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, లోటస్ గార్డెన్ వంటి వాటిని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పెట్టుబడిదారులను స్వాగతిస్తామన్నారు. ముందుగా పెట్టుబడిదారులు పర్యాటక శాఖతో ఒప్పందం చేసుకొని, పర్యాటక శాఖ ద్వారా తమకు నివేదికను అందజేస్తే, వాటిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో తోటపల్లి, వెంగళరాయసాగరం, పెద్దగెడ్డ వంటి రిజర్వాయర్లు ఉన్నాయని, ఆయా ప్రాంతాల వద్ద బోటింగ్, వాటర్ స్పోర్ట్స్ వంటివి ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. పార్వతీపురం, సాలూరు, పాచిపెంట ప్రాంతాలకు ఇవి దగ్గరగా ఉంటాయని, సెలవు రోజుల్లో ఎక్కువగా పర్యాటకులు వచ్చేందుకు అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. అలాగే తోటపల్లి వద్ద గల ఐటిడిఎ పార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. అడలి వ్యూ పాయింట్ వద్ద రక్షణ గోడలు, రహదారి పనులు, రెండు గదుల నిర్మాణాలు వీలైనంత త్వరగా పూర్తికావాలని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్పష్టం చేసారు. పార్వతీపురంలో బడ్జెట్ హెూటల్ నిర్మాణానికి ముందుకు వచ్చిన పెట్టుబడిదారులకు స్థలాన్ని అప్పగిస్తామని, ప్రభుత్వం ఇందుకు రాయితీలను ప్రకటించిందని కలెక్టర్ గుర్తుచేశారు. అరుకు - సాలూరు - పార్వతీపురం మీదుగా మందస వరకు గల సర్క్యూట్ టూరిజంను వీలైనంత త్వరగా ప్రతి పాదనలు పంపి ప్రారంభించాలని సూచించారు. జగతిపల్లి రీసార్ట్స్ వద్ద చేపట్టాల్సిన పెండింగ్ పనులపై దృష్టి సారించాలని అన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, జిల్లా పంచాయతీ అధికారి టి. కొండలరావు, అడ్వంచర్ అండ్ వాటర్ స్పోర్ట్స్ డైరక్టర్ బి.బలరాంనాయుడు, నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు ఆర్.అప్పలనాయుడు, తోటపల్లి రిజర్వాయర్ ఉపకార్యనిర్వాహక ఇంజినీరు టి.రఘునాథ నాయుడు, దేవాదాయ శాఖాధికారి ఎస్.రాజారావు, మునిసిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, సాలూరు మునిసిపాలిటీ మేనేజర్ బి.ఎం శివప్రసాద్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్. రమేష్, జట్టు ఆశ్రమం పారినాయుడు పాల్గొన్నారు.

సురక్షిత మంచినీటి సరఫరాకు చర్యలు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఈనెల 1వ తేదీ శనివారం విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమైన "కమిషనర్ గారూ కలుషిత నీరే మాకు శరణ్యమా" అన్న వార్తకు స్పందించిన మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ అధికారులు సంబంధిత సమస్య గలిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ప్రచురితమైన వార్తకు స్పందించి మాట్లాడారు. పురపాలక సంఘ పరిధిలో 4 వార్డులో క్షేత్ర స్థాయి నీటి సరఫరా జరుగు సమయంలో పరిశీలన చేయగా ఇంటి కొళాయిలు గ్రౌండ్ లెవెల్ కన్నా దిగువన ఉండటం వలన నీటి సరఫరా పూర్తయిన పిదప కలుషిత నీరు సరఫరా చేయు పైపులైన్లలోకి వెళ్లటం జరుగుతున్నదన్న విషయాన్ని గమనించడం జరిగిందని నీటి సరఫరా చేయుటకు గాను గతంలో వేసిన పైపులైన్లు సుమారు 30 సంవత్సరములు దాటిందని, నీటి సరఫరా చేయు పైపు లైన్లులో లీకులను గుర్తించడం జరిగిందన్నారు. 4వ వార్డులో గల ప్రజలకు సురక్షిత మంచినీటి సరఫరా వేయుటకు గాను తాత్కాలికంగా అవసరమైన చోట పైపులైన్లను రీప్లేస్ చేసి లీకులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి గ్రౌండ్ లెవల్ కన్నా దిగువన కొళాయిలను బిగించడం ద్వారా రక్షిత మంచినీటి సరఫరా చేయుటకు గాను చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పట్టణంలో శాశ్వతంగా రక్షిత మంచినీటి సరఫరా చేయుటకు గాను తగు ప్రతిపాదనలు ఏ.ఐ.వి.బి పథకంలో పొందుపరచడం జరిగినదని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా జరిమానాలు

విశాలాంధ్ర - బలిజిపేట: ట్రాఫిక్ నేరాలకు అనుగుణంగా జరిమానాలు విధిస్తామని ఎస్ఐ సింహాచలం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం రోడ్డు ప్రమాదంలో ప్రజలు మరణిస్తున్నందున పార్వతీపురం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. హెల్మెట్ లేకుండా బైకు నడపడం వలన వెయ్యి రూపాయలు, సీటు, బెల్టు లేకుండా కారు నడిపితే వెయ్యి రూపాయలు, తాగి వాహనం నడిపితే పదివేల రూపాయలు జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సెమినార్‌లో శ్రీ నిధికి ప్రథమ స్థానం

విశాలాంధ్ర - కురుపాం: నేషనల్ సైన్స్ డే సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఎపి మోడల్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని నెల్లి శ్రీనిధి మొదటి స్థానం సాధించింది. మన్యం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సెమినార్ "ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ వికసిత్ భారత్" అనే అంశంపై ఉల్లిభద్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో సెమినార్‌లో ఉత్తమ ప్రతిభ చాటి శ్రీ నిధి మొదటి స్థానంలో నిలిచింది. విజేతలకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతి నాయుడు బహుమతి ప్రధానం చేశారు. ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి, ఉపాధ్యాయులు కె.లక్ష్మీ రాజ్యం, సైన్స్ ఉపాధ్యాయులు హరిప్రసాద్ అభినందించారు.

నేటి నుండి క్రాష్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలో రాబోవు వేసవి దృష్ట్యా తాగు నీటి ఎద్దడిని నివారించే కార్యక్రమంలో భాగంగా క్రాష్ ప్రోగ్రాం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ శంబంగి రమేష్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాబోవు వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని మండల పరిధిలో గల 31 పంచాయతీల గ్రామాల పరిధిలో ఎటువంటి నీటి కొరత లేకుండా మండల కేంద్రమైన జియ్యమ్మవలసలో ప్రారంభమై వచ్చేనెల 30వ తేదీ వరకు 45 రోజులపాటు అన్ని పంచాయతీలలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో హోంగార్డులను ఏపీకి బదిలీ చేయాలి

విశాలాంధ్ర - బెలగాం: తెలంగాణ రాష్ట్రంలో ఉంటున్న హోంగార్డులను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ సోమవారం అఖిల భారత యువజన సమాఖ్య అధ్యక్షుడు సింహాద్రి కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి కె.గోపి నాయుడు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన వేలాదిమంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సెలెక్ట్ అయి రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో ఉండిపోవాల్సి వచ్చిందని అక్కడ వారంతా తీవ్ర ఇబ్బంది పడుతు న్నారని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులను వారి స్థానికత ప్రకారం మార్చడం జరిగింది కానీ హోంగార్డులను మాత్రం మార్చలేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కి సంబం ధించిన హోంగార్డ్స్ పనిచేస్తున్నారని కుటుంబాలు ఆంధ్ర ప్రదేశ్‌లో ఉండడం వలన ఇబ్బందులు పడుతున్నారని, కొంతమంది పిల్లలు తెలంగాణలో చదువుతున్నారని వారు భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్లో స్థాని కతను కోల్పోవలసి వస్తుందని ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. 11 ఏళ్ళుగా స్వరాష్ట్రాలకు వెళ్ళడానికి ఎదురు చూస్తున్న వారిని తీసుకురావాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలి: డాక్టర్ జగన్మోహనరావు

విశాలాంధ్ర - కొమరాడ: గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వ్యాధి లక్షణాలు సకాలంలో గుర్తించడంపై దృష్టి సారించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డా పిఎల్. రఘుకుమార్ వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం గుణానుపురం గ్రామంలో ఆకస్మికంగా సందర్శించారు. హెల్త్ వెల్నెస్ కేంద్రంలో నిర్వహించిన ఎఫ్.డి.పి కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అక్కడ వైద్య సేవలు వినియోగిం చుకుంటున్న గ్రామస్తులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. బిపి, మధుమేహం దీర్ఘకాలిక రుగ్మతలకు మందులు వినియోగిస్తున్న తీరు, ఏ మేరకు ఆరోగ్యం మెరుగు పడుతుంది అన్న విషయాలు తెలుసుకున్నారు. గర్భిణీలకు నిర్వహించిన వైద్య తనిఖీల వివరాలు ఎంసిపి కార్డులో పరిశీలించి హైరిస్క్ గర్భిణీల ఆరోగ్యాన్ని తరచుగా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.శిరీష, సూపర్వైజర్ విజయనిర్మల, వైద్య సిబ్బంది వర్షిణి, శ్రావణి, 104 సిబ్బంది తదితరులు ఉన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

దత్తత అధికారి మహేంద్రకుమార్

విశాలాంధ్ర - సాలూరు: మరికొద్ది రోజులలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నందున పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిసిసి డివిజనల్ మేనేజర్ ఉరిటి మహేంద్ర కుమార్ అన్నారు. తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు అడాప్షన్ అధికారిగా ఉన్న మహేంద్రకుమార్ సోమవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ 17వ తేదీ నుండి జరగబోవు పది వార్షిక పరీక్షలలో తోణాం పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఉత్తమ ఫలితాలు రాబట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాచలం, ఉపాధ్యాయులు మువ్వల లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్

విశాలాంధ్ర - సీతంపేట: రానున్న వేసవికాలం దృష్ట్యా ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నీటి ఎద్దడి నెలకొన్న గిరిజన గ్రామాల వివరాలు సేకరించి అందుకు తగ్గట్టుగా నీటి సరఫరాకు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. తాగునీటి సమస్య ఉన్న ప్రతి గ్రామానికి నీరు సరఫరా చేసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి ఏడాది ట్యాంకుల ద్వారా సరఫరా చేసే పద్ధతికి బదులుగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. చెక్ డ్యాం నిర్మాణాలకు ప్రణాళికలు తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీతంపేట ఎంపీడీవో గీతాంజలి, ఆర్డబ్ల్యూఎస్ డీఈ, నాలుగు మండలాల ఏఈలు, ఇరిగేషన్ శాఖ డీఈ తదితరులు పాల్గొన్నారు.

కంపు బాబోయ్....కంపు

- పాత బస్టాండులో అపారిశుధ్యం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

విశాలాంధ్ర - పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రానికి అనేక ప్రాంతాల నుండి వేలాదిమంది పాడేరు పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వస్తూ ఉంటారు. పాడేరు పట్టణంలో డ్రైనేజీ కాలువలపై చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. పాడేరు ఓల్డ్ బస్టాండ్ టీ టైం ముందర ఉన్న డ్రైనేజీలో కుప్పలు తెప్పలుగా టీ గ్లాసులు, వాటర్ బాటిల్ దర్శనమిస్తున్నాయి. దాన్ని శుభ్రం చేయాల్సిన పంచాయతీ అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడడంలేదు. ఈ డ్రైనేజీలో పడేసిన వ్యర్థాలతో మరింత దుర్వాసన వచ్చి ప్రజలు నిలువ లేని పరిస్థితి నెలకొంది. పాడేరు పట్టణంలో డస్ట్ బిన్‌లు అక్కడక్కడ ఒకటి రెండు పెట్టినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో డస్ట్ బిన్‌లు లేకపోవడం ఒక కారణం కాగా ప్రజలకు పంచాయితీ అధికారులు అవగాహన కల్పించకపోవడం మరో కారణం. రోడ్ల డ్రైనేజీలపై వ్యర్థాలను పడేయడం అది కుళ్ళిపోయి దుర్వాసన వెదజల్లి ప్రజలు అనేక రోగాలకు పాలవుతూ ఆసుపత్రిలో చేరుతున్న పరిస్థితులు అనేకమున్నాయి. పట్టణంలో వ్యర్థాలపై సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలో ఉన్న డ్రైనేజీలతోపాటు వ్యర్థాలను శుభ్రం చేసి ప్రజలు రోగాల పాలు కాకుండా చూడగలరని వివిధ ప్రజా సంఘాలు పట్టణ ప్రజానీకం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కోరుతున్నారు.

పోలీసుల చొరవతో మౌలిక వసతుల కల్పన

విశాలాంధ్ర - జి.మాడుగుల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల వసతి గృహంలో తాగునీటి సదుపాయంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించి పోలీసులు ఓదార్యం చాటుకున్నారు. కళాశాల వసతి గృహ సందర్శనకు వెళ్లిన ఎస్.షణ్ముఖరావుకు విద్యార్థులు నెలకొన్న సమస్యలైన తాగునీటి సదుపాయం బట్టలు ఉతుకుకునేందుకు ఎటువంటి సదుపాయాలు, పలు సమస్యలను ఎస్ఐకి విన్నవించారు. సదరు విద్యార్థులకు హామీ ఇచ్చిన ఎస్పీ సుర్మతి ఆవుట్ పోస్ట్ సీఆర్పీఎఫ్ 298/బీఎన్ కుసీ రాజాకేసి, కమెండెంట్ రాజేశ్ పాండేలకు తెలియపరిచి సహకారాన్ని కోరండతో స్పందించిన వారు పై సమస్యలను పరిష్కరించే వీలుగా తాగునీటి సదుపాయం తోపాటు మౌలిక వసతులు కల్పిం చారు. పోలీసుల సేవలను పలువురు ప్రశంసించారు.

ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

విశాలాంధ్ర - చింతపల్లి: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు రెండు పరీక్ష కేంద్రాల నుంచి 466 మంది విద్యార్థులు హాజరైనట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ ఆర్‌జెసి ప్రిన్సిపాల్ కే.గోవిందరావు, రామేశ్వరంలు తెలిపారు.. 14 మంది గైర్హాజర య్యారని ఆయా కళాశాలల చీఫ్ సూపరిం టెండెంట్ లు తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ గౌడ్ సోమవారం తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఈ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

సాగుల ఘాట్ రోడ్డులో జీపు దగ్ధం

ప్రయాణికుడు మృతి, మహిళ పరిస్థితి విషమం
మరో 10 మంది ప్రయాణికులు తీవ్ర గాయాలు
క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన స్థానికులు

విశాలాంధ్ర - జీకే వీధి: సాగుల ఘాట్ రోడ్డులో సోమవారం జీపు దగ్ధమైన ఘటనలో ప్రయాణికుడు మృతి చెందాడు. చుట్టుపక్కల ప్రజలు అందించిన సమాచారం మేరకు సోమవారం గూడెం కొత్త వీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రగడ్డ గ్రామం నుంచి ఆర్వి నగర్ వారపు సంతకు గ్రామానికి చెందిన జీపులో ప్రయాణమయ్యారు. సాగుల ఘాటి ఎక్కుతుండగా నాల్గవ మలుపు వద్ద బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. జీపును డ్రైవర్ చాకచక్యంగా అదుపు చేయాలని ప్రయత్నించినప్పటికీ జీపు ప్రయాణికులతో బోల్తా పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎర్రగడ్డ గ్రామానికి చెందిన మర్రి వెంకట్రావు (70) మంటలు తాకిడికి అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన కొర్ర పెంగో (65) గాయపడి పరిస్థితి విషమంగా ఉంది. మరో 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో గూడెం కొత్తవీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

ఇంటర్ పరీక్షకు 97.36 శాతం మంది హాజరు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో సోమవారం జరిగిన సెకండ్ లాంగ్వేజ్ పేపర్ -2కు 5,454 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 5,310 (97.36%) మంది హాజరయ్యారని, మిగిలిన 144 మంది గైర్హాజరు అయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. అప్పలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఒకేషనల్ రెండవ సంవత్సరం పరీక్షకు 1,215 మంది హాజరు కావలసి ఉండగా 1,135 (98.42%) మంది హాజరయ్యారని, మిగిలిన 80 మంది గైరు హాజరయ్యారని తెలిపారు. మరో పక్క ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలకు మొదటి రోజైన సోమవారం 1,563 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 1,302 (83.30%) హాజరయ్యారని మిగిలిన 261 మంది గైరు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు తెలిపారు.

మన్యంలో వికసించిన విద్యా కుసుమం

రంగరాయ యూనివర్సిటీలో ఎంబిబిఎస్ పట్టా పొందిన మహేశ్వరి మానస

విశాలాంధ్ర - కొయ్యూరు: అల్లూరి జిల్లా మన్య ప్రాంతంలో విద్యా కుసుమం వికసించింది. కొయ్యూరు మండలం నడింపాలెం గ్రామానికి చెందిన గిరిజన బిడ్డ సుమ్మర్ల మహేశ్వరి మానస (23) ఆదివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ పట్టా పొందారు. మహేశ్వరి మానస తండ్రి వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ తన చిన్నతనంలోనే మృత్యువాత పడ్డారు. దీంతో తల్లి మాజీ ట్రైకార్ డైరెక్టర్ సరస్వతి వైద్య రంగంలో తనను ఉన్నత శిఖరానికి చేర్చింది. ఈ సందర్భంగా మహేశ్వరి మానస మాట్లాడుతూ గిరిజన ప్రాంతానికి చెందిన తాను ఈ స్థాయికి చేరుకునేందుకు తన తల్లి ఎంతగానో శ్రమ పడిందని కావున తాను పుట్టి పెరిగిన ప్రాంతానికి, పేద ప్రజానీకానికి సేవ చేయడమే తన ముందున్న జీవిత ఆశయమని ఆమె తెలిపారు. తమ ప్రాంతానికి చెందిన గిరిజన బిడ్డ ఉన్నత శిఖరాలకు చేరుకోవడం పట్ల పలు వురు అభినందనలు తెలియజేసి మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

రహదారికి నోచుకోని బచ్చలగొంది గ్రామం

- 16 లక్షలు మంజూరు
- నేటికీ ప్రారంభం కాని పనులు

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలోని సంకాడ పంచాయతీ వసువాడ నుంచి మెట్టవీధి మీదుగా బచ్చలగొంది గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని జనసేన నాయకులు ఊలం ఈశ్వరరావు, బచ్చల గుంది తదితర గ్రామాల గిరిజనులు కోరుతు న్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో వసువాడ గ్రామం నుంచి బచ్చలగొంది గ్రామం వరకు సిసి రహదారి నిర్మాణానికి 16 లక్షలు మంజూరైందని అయినా నేటికీ పనులు ప్రారంభం కాలేదని తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించి రహదారి కష్టాన్ని తీర్చాలని ఆవేదన చెందారు. ఈ రహదారి పనులకు సంబంధించి శంకుస్థాపన చేసినా భూ వివాదం కారణంగా నేటి వరకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదన్నారు. అప్పట్లో ఈ రహదారికి భూ వివాదం ఉండి అది సద్దుమనిగిన రహదారి నిర్మా ణానికి అడ్డంకులు తొలగిపోయాయని, ఈ మేరకు అధికారులు రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టి ఆయా గ్రామాల గిరిజనులు పడుతున్న కష్టాలను అధికారులు తీర్చాలని గ్రామస్తులు వేడుకున్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - కొయ్యూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగిందని కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.వెంకటరమణ, ఎస్సై కిషోర్ వర్మ తెలిపారు. మండల కేంద్రమైన రాజేంద్రపాలెం కేజీబీవీ, బాలికల ఆశ్రమ పాఠశాల, కొయ్యూరు బాలుర పాఠశాల, గవర్నమెంట్ హైస్కూల్‌లో ఈ వ్యాచరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటరమణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుల్లో రాణించి తల్లిదండ్రులకు చదివిన పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వము నూతనంగా ప్రవేశపెట్టిన మోటర్ చట్టంపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల నివేదిక అందించండి

ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశం

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండలంలో గిరి శిఖర గ్రామాలైన చిన్నకోనల, చిడి వలస తదితర గ్రామాలకు రహదారి నిర్మాణానికి అటవీ శాఖ అధికారులు సహకరించాలని, లేనిపక్షంలో అభ్యంతరాలు ఉన్న వాటి వివరాలు అందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ఆదేశించారు. అల్లూరి జిల్లాలో రహదారి పనులను అటవీ శాఖాధికా రులు ఆటంకపరుస్తున్నారంటూ గిరిజనులు నిరసన చేపట్టిన విషయమై వచ్చిన వివిధ పత్రికా కథనాలపై కమిషన్ చైర్మన్ శంకరరావు స్పందించారు. అనంతగిరి మండలంలో నాన్ షెడ్యూల్ ప్రాంతమైన రొంపల్లి పంచాయతీ పరిధిలో గిరి శిఖర గ్రామాలైన చిన్నకోనల, చిడివలస, భూరిగా, వనిజతోపాటు ఎన్ఆర్ పురం పంచాయతీ పరిధి మరో ఐదు గ్రామాలకు రోడ్డు పనులకు నిధులు మంజూరు అయినప్పటికీ అటవీశాఖ అభ్యంతరం తెలుపుతోందంటూ చిన్న కోనల, వనిజ గ్రామాల వద్ద గిరిజనులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఆయా రోడ్లకు నిధులు మంజూరు, తదనంతరం అటవీశాఖ అభ్యం తరాలపై కమిషన్‌కు నివేదిక సమర్పించాలని చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు సంబంధిత అధి కారులకు ఆదేశించారు. గిరిజనుల జీవనానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అలసత్వం వహించరాదన్నారు. అభ్యంతరాల నివేదిక సమర్పిస్తే కేంద్ర అటవీ శాఖ అధికారులతో చర్చిస్తానని తెలిపారు.

7న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - కొయ్యూరు: ఈనెల 7న కొయ్యూరు మండలం సర్వసభ్య సమావేశం ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన మండల అభివృద్ధి కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి ఎస్‌కెవి ప్రసాద్ తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశం ఈ నెల 7న శుక్రవారం 11 గంటలకు జరుగుతుందని కావునమండలంలో ఉన్న 33 పంచాయతీల సర్పంచులు 15ఎంపీటీసీలు జడ్పిటిసి వారా నూకరాజు , ఎంపీపీ బడుగు రమేష్ తో పాటు మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అలాగే మండల అధికారులు వారి శాఖల యొక్క పూర్తి నివేదికలుతో హాజరుకావాలని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఘనంగా మన్యంకొండ జాతర

వేలాదిగా తరలివచ్చిన భక్తులు
పటిష్ట బందోబస్తు మధ్య వనదేవతల శోభాయాత్ర

విశాలాంధ్ర - మోతుగూడెం: అల్లూరి సీతారామ జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతం వద్ద మన్యంకొండ జాతర(బడాయాత్ర) పురస్కరించుకొని పొల్లూరు జలపాతం వద్ద సోమవారం వనదేవతలకు మంగళస్నానం, ప్రాణప్రతిష్ట, కార్యక్రమాలు నిర్వహించారు. రెండేళ్లకు ఒకసారి ఒడిశా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే మన్యంకొండ జాతరలో వనదేవతలకు ఇలా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం ఉదయం 8 గంటలకు ఒడిస్సా నుంచి వనదేవతలను ప్రత్యేక పడవలో సీలేరు నది దాటించి అర్చకులు అయినవిల్లి కుమార్ స్వామి శర్మ ఆధ్వర్యంలో ఏపీ జెన్‌కో పోలీసు ఉన్నతాధికారులు వనదేవతలకు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు సీలేరు నది దాటేందుకు నదిపై తేలియాడే ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. వేలాదిమంది భక్తులు మేళతాళాల మధ్య సాంప్రదాయబద్ధంగా ఘటం రూపాలలో ఉన్న వన దేవతలైన పోతురాజు, కన్నమరాజు, బాలరాజు, ముత్యాలమ్మ తల్లి ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి అభయారణ్యం గుండా పొల్లూరు జలపాతం వద్దకు శోభాయమానంగా ఊరేగించారు. సుమారు 20వేల భక్తులు తరలి రావడంతో జలపాతం వద్ద సందడి వాతావరణం నెలకొంది. మహిళా మండలి, అన్నపూర్ణ అన్నదాన ట్రస్ట్, పొల్లూరు మోతుగూడెం ముత్యాలమ్మ తల్లి జాతర కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భోజనాలు, తాగునీరు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలకు వనదేవతలను ఒరిస్సా రాష్ట్రానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మోతుగూడెం ఎస్సై శివ నారాయణ ఆధ్వర్యంలో 300 మంది పోలీసు, సిఆర్పిఎఫ్ సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఏ పిఓ అపూర్వభరత్, ఏఎస్పి అంకస్ కుమార్ మీనా, సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ వాసుదేవరావు, డీఈ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి గుంపునపల్లి మోహన్, సర్పంచ్ అకేటి సీత, ఎంపీటీసీ వేగినాగేశ్వరరావు పాల్గొని పర్యవేక్షించారు.

పరిమితికి మించి శబ్దాలతో వినికిడి సమస్యలు

విశాలాంధ్ర - బెలగాం : పరిమితికి మించిన శబ్దాలు వినడం ద్వారా వినికిడి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని జిల్లా వైద్యా రోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా డిఇఐసి (జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం)లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతికత జీవనశైలిలో ప్రతీ ఒక్కరూ వినికిడి సామర్థ్యానికి అవరోధం లేకుండా జాగ్రత్తపడాలని, చెవులను సురక్షితంగా ఉంచుకోవడం అవసరమని పేర్కొన్నారు. ఒక స్థాయికి మించిన శబ్దాలు తరచుగా వినడం వల్ల మన చెవిలో వినికిడి వ్యవస్థ దెబ్బతిని క్రమేణా వినగలిగే సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని అన్నారు. అరవై డెసిబిల్స్‌కు మించిన శబ్దం చెవులకు హాని కలిగిస్తుందని ముఖ్యంగా చిన్న పిల్లల వినికిడి వ్యవస్థ మరింత సున్నితంగా ఉంటుందని వారి పట్ల అత్యంత శ్రద్ధ అవసరమని, సెల్ ఫోన్స్, ఇయర్ ఫోన్స్ పిల్లలకు ఎక్కువగా అలవాటు చేయకూడదని సూచించారు. జిల్లా ఆర్బిఎస్కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.ఎల్.రఘుకుమార్ మాట్లాడుతూ డిఇఐసిలో శిబిరాల నిర్వహణ, అలాగే ప్రతీ రోజూ ఓపి ద్వారా పిల్లల్లో వినికిడి సమస్యలను ముందుగానే గుర్తించి పర్యవేక్షణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, వైద్యాధికారి డాక్టర్ లలిత, ఫిజియో థెరపిస్ట్ ఎద్దు లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాండ్ షాప్పీ ఆధ్వర్యంలో అతి పెద్ద షాపింగ్ మేళా

విశాలాంధ్ర - పాడేరు: భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న హైపర్-విలువ గల ఇ-కామర్స్ ప్లాట్ ఫారమ్?లలో ఒకటైన ఫ్లిప్కార్ట్ వారిచే షాప్ షీ ఈ సంవత్సరం అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న గ్రాండ్ షాప్షి మేళా (జి ఎస్ ఎం)ను ప్రారంభించబోతోంది. మార్చి 1 నుండి 9 వరకుషెడ్యూల్ చేయబడిన ఈ సంవత్సరవు మేళా భారతదేశం యొక్క ప్రియమైన సాంప్రదాయ వేడుకల ఆనందం మరియు శక్తిని డిజిటల్ ప్రపంచానికి తీసుకువస్తుందని, ఇది దేశవ్యాప్తంగా ఎన్నో కుటుంబాలకు మరపురాని షాపింగ్ అనుభవాన్ని అందిస్తుందని హామీ ఇచ్చింది. 'అతి పెద్ద షాపింగ్ మేళా, అతి తక్కువ ధరలు' అనే థీమ్?తో గ్రాండ్ షాప్ షి మేళా విలువైన షాపింగ్ యొక్క మాధుర్యం అందిస్తోందని ఆ సంస్థ ప్రాంతీయ ప్రతినిధి చెప్పారు. ఇది ఆకర్షణీయమైన మేళా-నేపథ్య షాపింగ్ అనుభవాన్ని తెస్తుంది.

ఘనముగా మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - బలిజిపేట: వంతరాము కేజీబీవీ హైస్కూల్లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సులేఖ మాట్లాడుతూ మహిళా దినోత్సవం వేడుకల్లో మహిళలందరినీ భాగస్వామ్యం చేస్తామని ప్రభుత్వ శాఖలలో ఉన్నత పదవులను వివిధ రంగాలలో మహిళలను గుర్తిస్తున్నామని మహిళలు తయారు చేసే అన్ని రకాల ఉత్పత్తులను స్టాల్స్ ఏర్పాటు చేస్తామని అన్నారు. మహిళలలో అనీమియా నివారణకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేస్తున్నామని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం 4వ తేదీన హెల్త్ ఉమెన్- హ్యాపీ ఉమెన్, బేటి బచావో- బేటి పడావో, యోగ ధ్యానం కార్యక్రమాలు చేపట్టి మండల స్థాయిలో, జిల్లాస్థాయిలో విజేతలైన వారికి అవార్డులను ప్రధానము చేస్తామని ఐసిడిఎస్ పిఓ తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ పద్మ పూర్ణిమ, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

3,4,5 తరగతుల పిల్లలను తరలించొద్దు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామం ఎంపిపి పాఠశాలలో 3, 4, 5వ తరగతుల విద్యార్థులను మోడ్రన్ చదువుల పేరుతో రాజవొమ్మంగి తరలించ వద్దంటూ కొండపల్లి గ్రామస్తులు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. తమ పిల్లల భవిష్యత్తు కోరితే ప్రభుత్వం 3,4,5వ తరగతులను ఇక్కడే కొనసాగించాలని, 8 కిలోమీటర్ల దూరంలో రాజవొమ్మంగి పంపడం కష్టమని తెలిపారు. అలాగే వర్షాకాలం రోడ్డు మధ్యలో ఉన్న వాగు పొంగితే దాటడం కష్టమని, ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ యాదగిరేశ్వరావుకి వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రాథమిక స్థాయిలో పఠన, లేఖన నైపుణ్యాలను పెంపొందించాలి

విశాలాంధ్ర - బలిజిపేట: ఒకటి నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే తెలుగు ఆంగ్ల భాషల్లో పఠన నైపుణ్యాలను, అదేవిధంగా లేఖన నైపుణ్యాలను పెంపొందించాలని బలిజిపేట మండల విద్యాశాఖ అధికారి 1 సామల సింహాచలం అన్నారు. సోమవారం ఆయన పి.చాకరాపల్లి, మురగడాం, అజ్జాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల డైరీలు లెసన్ ప్లాన్స్ పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పాఠాల్ని చదివించారు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ విషయాలను కూడా విద్యార్థులకు ప్రాక్టీస్ చేయించాలని, ఎఫ్ఏ 4 పరీక్షలను చక్కగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్ఎంటి వైకుంఠరావు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ పట్టాలందుకున్న గిరిజన కవలలు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం తంటికొండ పంచాయతీ ఎర్రంపాడు గ్రామానికి చెందిన ముర్ల రాము, భార్య సత్యవతి దంపతులకు పుట్టిన కవలలు సౌజన్య, శరణ్యలు కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా తండ్రి రాము మాట్లాడుతూ పిల్లలిద్దరూ చిన్నపాటి నుండి ఒకే చోట చదవడం వలన ఇద్దరి మధ్య చదువులో మంచి పోటీ ఉండేదని, ఆ పోటీతత్వం వలనే వారు ఎంబీబీఎస్ పూర్తి చేయగలిగారని తెలిపారు. విషయం తెలుకున్న బంధువులు, స్నేహితులు ఇరువురు డాక్టర్లకి అభినందలు తెలిపారు.

బైక్ ప్రమాదంలో భర్త మృతి: భార్యకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - కొయ్యూరు: కొయ్యూరు మండలం దౌనూరు పంచాయతీ నిమ్మలపాలెం సమీపంలో జరిగిన బైక్ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం 10 గంటల సమయంలో చోటుచేసుకుంది. వీటి వివరాలు ఇలా ఉన్నాయి చింతపల్లి మండలం వేనం గ్రామానికి చెందిన పాంగి భానుచందర్, తన భార్య జ్యోతితో కలిసి బైక్‌పై దౌనూరు మీ సేవలో ఆధార్ కార్డు పని నిమిత్తం వస్తుండగా నిమ్మలపాలెం సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఉన్న చెట్ల మధ్య పడిపోవడంతో బలమైన గాయాలు అయి రక్తస్రావంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. అయితే వెనుక కూర్చున్న తన భార్య జ్యోతికి బలమైన గాయాలు తగిలాయి. దీంతో స్థానికులు హుటాహుటిన స్పందించి నర్సీపట్నం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. భాను చందర్ మృతి చెందగా భార్య జ్యోతి తీవ్ర గాయాలతో వైద్య సేవలు పొందుతుంది. ఈ సంఘటనపై కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

సామూహిక వివాహాలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - కొయ్యూరు: త్రిదండి చినజీయర్ స్వామి ఆశీస్సులతో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సారధ్యంలో నిర్వహించు సామూహిక వివాహాలకు అర్హులైన నిరుపేద యువకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్, టీటీడీ ధర్మ ప్రచారక్ డి.పద్మరాజు తెలిపారు. వివాహ బంధంతో ఒకటి అవాలనుకునే నిరుపేద యువకులకు కల్యాణ యోగం కల్పిస్తూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి ఆశీస్సులతో ఏజెన్సీ ప్రాంతంలో ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ ఆధ్వర్యంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ పూర్తి సహాయ సహకారాలతో సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సామూహిక వివాహ కార్యక్రమం ద్వారా వివాహం చేసుకునే వధూవరులకు నూతన వస్త్రాలు, మధుపర్కాలు, కాలిమెట్టెలు, తలంబ్రాలు, పూలదండలు కర్పూరదండ లను సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. సామూహిక వివాహాలకై దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పురుషులు 21 సంవత్సరాలు స్త్రీలు 18 సంవత్సరాలు నిండిన వారై ఉండాలని, ఇరు కుటుంబీకుల అంగీకారంతో వివాహం చేసుకునే వారై ఉండాలని అందుకు వీలుగా తల్లిదండ్రులు అత్తమామల అంగీకారంతో వధూవరుల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మూడు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 200 జంటలకు వివాహం జరిపించాలనే సంకల్పంతో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామూహిక వివాహాలను చిన జీయర్ స్వామి ఆశీస్సులతో ఏప్రిల్ నెలాఖరున నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు తో పాటు పూర్తి సమాచారానికై డి పద్మరాజు (నాని) కాకరపాడు 7382273833, పల్లి లోవరాజు రామన్నపాలెం 8367082887, సెగ్గే సన్యాసిరావు, తాటిమానుపాలెం 9014294500లను సంప్రదించాలని వారు కోరారు.

పడాల భూదేవికి ఘన సన్మానం

విశాలాంధ్ర - సీతంపేట: హైదరాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిలెట్ రీసెర్చ్ ఐఐఏమర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కిసాన్ మేళా నిర్వహించటం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి భగీరత్ చౌదరి మరియు ఐఐఏమర్ డైరెక్టర్స్ తారా సత్యవతి పాల్గొన్నారు. సమావేశంలో చిరుధాన్యాల అభివృద్ధి, విస్తరణ, పరిశోధనల గురించి చర్చించారు. ఈ సమావేశంలో దేశం నలుమూలల నుండి అనేక మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు. అనంతరం చిరుధాన్యాల విస్తరణ, వాల్యూఎడిషన్ చేయటం, ఉమెన్ ఎంటర్ప్రెనుర్ తయారు చేయటం మూలంగా పడాల భూదేవిని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రివర్యులు భగీరత్ చౌదరి, ఐఐఏమర్ డైరెక్టర్ తారా సత్యవతి జాతీయ జీవ వైవిధ్య మండలి చైర్మన్ అవార్డు మెమంటో, శాలువతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం భూదేవి మాట్లాడుతూ ఈ సన్మానంతో నాకు మరింత బాధ్యత పెరిగిందని, చిరుధాన్యాల ద్వారా ప్రజలకు ఆరోగ్య వంతమైన చిరుధాన్యాల అభివృద్ధి చేయటానికి మా ఎఫ్‌పిఓ ద్వారా కృషి చేస్తానని చెప్పారు.

కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ద్వారా మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ విజ్ఞాపన

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పార్వతీపురం పట్టణ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నట్లు మంత్రి మండలి ప్రకటించిందని ఈ నిర్ణయాన్ని యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు గొర్లె వెంకటరమణ, యూనియన్ కమిటీ నాయకులు నాగవంశం మల్లేష్, గుంపు స్వామి తిరుపతిరావు నిర్మల సాగర్ తెలిపారు. ప్రభుత్వం చేసిన అనాలోచిత నిర్ణయాన్ని నిరసిస్తూ ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ద్వారా లేఖలు రాసి లేఖలను పార్వతీపురం పోస్ట్ ఆఫీస్‌లో వేశారు. అనంతరం కార్మికుల ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ వచ్చాక కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ గ్యారెంటీ ఉందని ఇలాంటి విధానాన్ని రద్దు చేసి థర్డ్ పార్టీ తీసుకువస్తే కార్మికులు మరలా దోపిడీ విధానాలు చూడాల్సి వస్తుందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయకుంటే జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో చలో విజయవాడ నిర్వహించే దానికి కూడా వెనుకాడబోమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ ప్రకటించాలని పెరిగిన జనాభాకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచాలని ఉద్యోగ భద్రత చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో గెలాక్సీ ఎంశ్రేణి

విశాలాంధ్ర - పాడేరు: భారతదేశంలోని అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, నేడు పలు విభాగాలలో అత్యున్నత ఫీచర్లతో రెండు మాన్స్టర్ పరికరాలైన గెలాక్సీ ఎం 16 5జీ మరియు గెలాక్సీ ఎం06 5జీ లను విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. అత్యంత ప్రజాదరణ పొందిన గెలాక్సీ ఎం సిరీస్‌కు తాజా చేర్పులు శైలి, అత్యాధునిక ఆవిష్కరణల యొక్క ఆకట్టుకునే కలయికను అందిస్తాయని సాంసంగ్ బిజినెస్ విభాగ హెడ్ అక్షయ్ ఎస్ రావు చెప్పారు. ప్రతి వినియోగదారునికి కొత్త అవకాశాలను నిర్ధారిస్తాయి. "గెలాక్సీ ఎం 16 5జీ మరియు గెలాక్సీ ఎం 06 5జీ లు ఎం సిరీస్ యొక్క జంట వారసత్వాలు మాన్స్టర్ ఆవిష్కరణలు మరియు పనితీరుతో వస్తాయన్నారు. ఈ పరికరాలు శైలి మరియు పనితీరు రెండింటినీ మెరుగుపరచడానికి రూపొందించబడ్డాయన్నారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళలందరిని భాగస్వాములను చేయాలన్నారు. ప్రేరణ సఖీ కింద ప్రభుత్వ శాఖల్లో ఉన్నత పదవులు అధిరోహించిన మహిళలు, పారిశ్రామిక వేత్తలు, విద్యావేత్తలు, క్రీడలు, వ్యవసాయంలో రాణించిన మహిళలు, సంగీత కళాకారులు, పారిశుద్ధ్యం, ఆశా, వైద్య రంగంలో విశేష సేవలు అందించిన మహిళ లను గుర్తించాలన్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధి పొంది ఆర్థికంగా ఎదిగిన మహిళలను కూడా పరిగణలోకి తీసుకోవాలని, ఆ మహిళల ద్వారా ఇతరులు ప్రేరణ పొందాలని అన్నారు. మహిళల ఎంపికలో అన్ని నియోజక వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాలకు అవకాశం కల్పించాలని సూచించారు. ఇందుకు ఒక కమిటీని నియమించి ఎంపికను చేపట్టాలన్నారు. గత మహిళా దినోత్సవం నుంచి ఈ మహిళా దినోత్సవం వరకు మహిళలు సాధించిన ప్రగతి, ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యతను వివరించాలన్నారు. మహిళలు తయారుచేసే అన్ని రకాల ఉత్పత్తులు, తినుబండారాలు వంటి స్టాల్స్ ఏర్పాటు కావాలని పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన హెల్తీ ఉమెన్ హ్యాపీ ఉమెన్ పేరిట యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలు చేపట్టాలని, మండల స్థాయి విజేతలకు ఈ నెల 6వ తేదీన, జిల్లా స్థాయిలో 7వ తేదీన అవార్డులు ప్రధానం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత, జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి టి. కనకదుర్గ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు వై. సత్యంనాయుడు, మెప్మా పథక సంచాలకులు కె. శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి కరుణాకర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్. రమేష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సాయికృష్ణ చైతన్య, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, జిల్లా, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి రక్షణ చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర - దేవీపట్నం: మండలంలోని గొందూరులో గోదావరి ఒడ్డున వేంచేసిన మాతృశ్రీ గండి పోశమ్మ ఆలయ అభివృద్ధి రక్షణకు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం రంపచోడవరంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కెఆర్ కల్ప శ్రీను కలిసి విజ్ఞప్తి చేయటం జరిగింది. పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురవుతున్న దేవీపట్నం మండలం, గొందూరు గ్రామంలో గల శ్రీ గండి పోశమ్మ అమ్మవారి ఆలయం రక్షణ, అభివృద్ధి తదితర పనులను సత్వరమే ప్రారంభించి పూర్తి చేయించాలన్నారు. దానికి సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఫైళ్ళను పరిశీలించి ఈ విషయంలో ఉన్నతాధికారులను వెంటనే కోరతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొందూరు గ్రామస్థులు, జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరావు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గండి వెంకట లక్ష్మీ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఐటిడిఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - సీతంపేట: ఐటిడిఏ పరిధిలో ఇంజనీరింగ్ విభాగం ద్వారా జరుగుతున్న అన్ని రకాల అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. సోమవారం ఐటీడీఏ పీవో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అన్నారు. మల్టీపర్పస్ సెంటర్ల పనులను పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సీసీడీపీ ద్వారా చేపడుతున్న పనులను కూడా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎక్కడ కూడా నాణ్యత లోపించకూడదని అన్నారు. పూర్తయిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రమాదేవి, డీఈలు సింహాచలం, కృష్ణకుమార్ సిమ్మన్న, ఏఈలు నాగభూషణ్, సింధుజ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలోని పెదవలస పంచాయతీ రంపుల గ్రామంలో శ్రీ గాం కొండ మల్లేశ్వరి 51 తీర్థ మహోత్సవములను ఈనెల 14 నుంచి 17 వరకు అంగరంగ వైభవంగా జరుపనున్నామని ఉత్సవ కమిటీ కంకిపాటి రామారావు, కంకిపాటి గిరిబాబు, చల్ల నరేష్, కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ తీర్థ మహోత్సవం సందర్భంగా రంపుల గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. గూడెం కొత్త వీధి మండల పరిధిలోని గ్రామాల క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని వివరాలకు 7569260021, 93819 10443, 8688797162లను సంప్రదించి 10వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 137 మంది హాజరు

విశాలాంధ్ర - వై.రామవరం: వై.రామవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రంలో సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు 137 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెంట్ ఈశ్వర కృప తెలిపారు. 139 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు విద్యార్థినులు గైర్హాజరు అయ్యారన్నారు. వీరిలో వై.రామవరం నుండి 55 మంది, పి.యెర్రగొండ నుండి 69 మంది తోటకూర పాలెం కేజీబీవి నుండి 15 మందికి 13 మంది పరీక్షలు రాసారన్నారు.

బక్కలపనుకులో మంచినీటి కష్టాలు

- బిందెడు నీళ్ల కోసం అగచాట్లు
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

విశాలాంధ్ర - పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలో గల బక్కల పనుకు ఏరియాలో బిందె మంచినీళ్ల కోసం అష్ట కష్టాలు పడుతున్న మహిళలు జిల్లా కేంద్రంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడమే వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో పట్టణంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా కూడా అనేక ప్రాంతాలకు మంచినీటి కోసం అష్ట కష్టాలు పడుతూ ఊట గెడ్డ నీరును ఆశ్రయిస్తూ అనేక రోగాలు పాలవుతున్నటువంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి. పట్టణంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు మానవ దృక్పథంతో తన ట్రస్టు ద్వారా మంచినీటి ట్యాంకర్లు అందిస్తున్నప్పటికీ పట్టణ ప్రజలకు అటు ఆ నీరు చాలక ఇటు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం వల్ల పట్టణ ప్రజలు మంచినీళ్ల కోసం అష్ట కష్టాలు పడుతున్నారు. పట్టణంలో ఉన్న పబ్లిక్ బోర్లు అనేక చోట్ల మరమ్మత్తులకు గురికావడం ఒకటి రెండు చోట్ల గృహాలు నిర్మించుకున్న ప్రబోధులు దాన్ని కత్తిరించి పెంట కుప్పల్లో పారేసిన సంఘటనలు పట్టణంలో అనేకం చూస్తున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాడేరు పట్టణంతో పాటు మంచినీళ్ల సౌకర్యం లేని గ్రామాలకు మంచినీళ్ల సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు అటుగా అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూద్దాం.

ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం కలిగించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాజవొ మంగి ఎపిఆర్ బాలికల జూనియర్ కాలేజీ, అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలో అన్ని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు మంచి వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా వెలుతురు,ఫ్యాన్లు, త్రాగునీరు ఎక్కడికి అక్కడ ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ఏజెన్సీలో పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగా సంబంధిత పరీక్ష కేంద్రాలకు సకాలంలో హాజరు అవ్వాలని ఆయన అన్నారు. ఏజెన్సీలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా ఎటువంటి ఇబ్బందులకు తావు లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. అదేవిధంగా రాజవోమంగి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ ఈ ఆస్పత్రికి వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి సంబంధిత వ్యాధులకు ఉచిత మందులు రోగులకు అందజేయాలని ఆయన అన్నారు. ఈ ఆసుపత్రిలో ఎంతమంది వైద్యాధికారులు ఉన్నది, ఎంతమంది సిబ్బంది ఉన్నది. ప్రతిరోజు ఎంతమంది రోగులు ఈ ఆస్పత్రికి వచ్చుచున్నది అదేవిధంగా ఈ ఆసుపత్రి పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది ఆయన ఆరా తీశారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సోమవారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు కళాశాల యాజమాన్యం సజావుగా నిర్వహిస్తున్నారు. జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ దుమంతి సత్యనారాయణ సీలేరు చేరుకొని పరీక్షకు హాజరైన విద్యార్థిని విద్యార్థులను తనిఖీలు నిర్వహించారు. తగు సమయానికి పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకునేలా చూడాలని, అలాగే మాస్ కాఫీయింగ్ పాలుపడకుండా జాగ్రత్తలు పాటించాలని కళాశాల ఛీఫ్ సూపరెంటెండెంట్ వి.శంకర్రావు, డిపార్ట్మెంటల్ అధికారి కేవి.రత్నంకు సత్యనారాయణ సూచించారు. సీలేరు ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో కాలేజ్ ఆవరణలో బందోబస్తు ఏర్పాటు చేసారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

విశాలాంధ్ర - గంగవరం: వన్యప్రాణులను రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గంగవరం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.నూకరాజు దొర అన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. కాపాడుకోవడం వల్ల అడవులలో నివసించే వన్యప్రాణులను కాపాడుకునే వీలుంటుం దన్నారు. అడవులలో వన్యప్రాణులు ఉంటేనే అడవులు సంరక్షించబడతాయని ఆయన అన్నారు. అలాగే అడవుల వల్ల వాతావరణ కాలుష్యం నుంచి కాపాడుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అడవుల పరిరక్షణ జంతువుల పరిరక్షణ చేపట్టాలని సూచించారు. మొక్కల పెంపకం ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వరలక్ష్మి ,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ప్రశాంత్ కుమార్, అరుణశ్రీ, మాణిక్యం, వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలపై సమీక్ష

విశాలాంధ్ర - అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత సర్వేలు తక్షణం పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శిలకు ఎంపీడీవో ఏవివి కుమార్ ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలపై కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా మిస్సింగ్ మ్యాపింగ్ సర్వే త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే ఆధార కార్డు లేని పిల్లల సర్వే కూడా వేగవంతం చేయాలని ఆధార్ కార్డు లేని పిల్లలను గుర్తించి వారికి ఆధార్ కార్డు జారీ పై శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగి తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వెయ్యాలని గతంలో కూడా ఆదేశాలు ఇచ్చామని బయోమెట్రిక్ బట్టి జీతాలు పెట్టాలని కార్యదర్శిలకు ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 2.0 కి సంబంధించి అన్ని గ్రామ పంచాయతీల వద్ద హౌసింగ్ లబ్ధిదారుల సర్వే పూర్తి చేయాలని ఈ సర్వేలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండలంలో ఉన్న కార్యదర్శులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్లు ఢీ: వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : ఎదురుగా వస్తున్న మోటార్ సైక్లిళ్ళు ఢీకొనడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం మరుపెంట గ్రామానికి చెందిన గంట శంకర్రావు ధాన్యం వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో మోటార్ సైకిల్ పై పార్వతీపురం మండలం మరికి గ్రామం వెళ్తుండగా గదబవలస గ్రామం మలుపు వద్ద ఒడిషా రాష్ట్రం అలమండ వైపు నుండి పార్వతీపురం వైపు మోటార్ సైకిల్ పై వస్తున్న వ్యక్తి ఢీ కొట్టాడు. ఈసంఘటనలో శంకర్రావుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అతనిని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. అపస్మారక స్థితికి చేరుకోవడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం రిఫర్ చేశారు. శంకర్రావు భార్య అప్పలనరసమ్మ తెలిపిన వివరాల మేరకు ఔట్ పోస్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి

విశాలాంధ్ర - మక్కువ: స్థానిక ఎస్ ఎన్ స్కూల్లో ప్రధాన ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న టి.ప్రకాశందొర (52) ఆదివారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో హుటాహుటిన బొబ్బిలి ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా రాత్రి తెల్లవారితే సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్వగ్రామం కొమరాడ మండలం కుమ్మరి గుంట గ్రామం కాగా కుటుంబ సభ్యులు భార్య పాప బోరున విలపిస్తున్నారు.

బలపం కోరుకొండలో పల్సర్ బైక్ (కండక్టర్) ఝాన్సీ మెగా ఈవెంట్

విశాలాంధ్ర - చింతపల్లి: మండలంలోని ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతమైన బలపం కోరుకొండ శ్రీ శ్రీ శ్రీ కోటి లింగేశ్వర స్వామి, బంగరమ్మ తల్లి తీర్థ మహోత్సవంలో ప్రముఖ డ్యాన్సర్, పల్సర్ బైక్ ఝాన్సీ (ఆర్టీసీ కండక్టర్) మెగా ఈవెంట్ (నృత్య) కార్యక్రమం నిర్వహించబడునని ఉత్సవ కమిటీ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ తీర్థ మహోత్సవాలు రెండు రోజులపాటు నిర్వహించబడుననీ మొదటి రోజైన సోమవారం సినీ. డూప్స్ డాన్స్ కార్యక్రమం నిర్వహించబడునని మంగళవారం చంటి మెగా ఈవెంట్స్ పేరిట ప్రముఖ పల్సర్ బైక్ డాన్సర్ ఝాన్సీచే గొప్ప నృత్య ప్రదర్శన నిర్వహించబడునని, ఈ కార్యక్రమానికి భక్తులతో పాటు, మన్యంలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు కోరారు.

శ్రీ కోటదుర్గ అమ్మవారి హుండి లెక్కింపు

విశాలాంధ్ర - పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ పట్టణంలో వేంచేసియున్న శ్రీ కోటదుర్గమ్మ తల్లి వారి హుండీల ఆదాయం 12,30,460రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణధికారి వివి సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఆలయంలో నిర్వహించిన హుండీల లెక్కింపు ద్వారా 89 రోజులకు గాను హుండీల ద్వారా వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వై.ఇందిర పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మి ప్రసాద్ శర్మ, వేమకోటి శర్మ బాబు, ఎస్ వి జి బి బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.